## క్లుప్తంగా

### పీహెచ్‌సీ తనిఖీ



కామారెడ్డి రూరల్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి పీహెచ్‌సీని బుధవారం జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోహాముజీబ్‌ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

### ‘యుద్ధ గీతం’ సామాన్యుడికి అండగా నిలుస్తుంది’



కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల గఫూర్ శిక్షక్ రచించిన ‘యుద్ధగీతం’ కవితాల సంపుటిని ప్రముఖ కవి, పరిశోధకులు విశ్రాంత ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావుకు అందజేశారు. బుధవారం తిరుమలరావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తెరవే రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డితో వెళ్లి కలిశారు. ఈపుస్తకం సామాన్యుడికి అండగా నిలుస్తు చైతన్యబాటలో నడిపించేందుకు కృషి చేస్తుందని తిరుమలరావు అన్నారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే



భిక్కనూరు: కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నిధులతో మండలంలోని జంగంపల్లి గ్రామంలోని గంగ పుత్ర సంఘం భవనానికి స్లాబ్‌ను బుధవారం వేయించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. మండల ప్రధానకార్యదర్శి అత్తెల్లి తిరుమలేశ్,నేతలు నరేందర్, ప్రవీణ్, లింగారెడ్డి, జైపాల్‌రెడ్డి, రంజిత్, చంద్రం గంగ పుత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### భిక్కనూరు విండో ఇన్‌చార్జి కార్యదర్శిగా రవికిరణ్



భిక్కనూరు : మండలకేంద్రంలోని సింగిల్‌విండో ఇన్‌చార్జి కార్యదర్శిగా పసుల రవికిరణ్‌ను నియమిస్తూ భిక్కనూరు సింగిల్‌విండో ఏకగ్రీవంగా తీర్మానించింది. విండో చైర్మన్ గంగ్ల భూమయ్య అధ్యక్షతన సమావేశమైన పాలకవర్గ సభ్యులు సహకారశాఖ అధికారుల ఉత్తర్వుల మేరకు విండో కార్యదర్శి నర్సింలును, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి గంగారాములను విధుల నుంచి తప్పిస్తూ తీర్మానించారు. ఈ మేరకు విండో చైర్మన్ గంగ్ల భూమయ్య ఇన్‌చార్జి కార్యదర్శిగా రవికిరణ్‌కు నియమాక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విండో వైస్ చైర్మన్ ముచ్చర్ల రాజిరెడ్డి, డైరెక్టర్లు పెద్దబచ్చగారి మైపాల్‌రెడ్డి, బచ్చగారి నర్సింలు, మద్దురి నర్సింలు, ఉప్పరి సాయిలు, అంబళ్ల మల్లేశం, జేపీ. వెంకటిగౌడ్, అందే జయమ్మలు పాల్గొన్నారు.

### ఆలయ ప్రహరీ కూల్చివేత



కామారెడ్డి రూరల్ : మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గాయత్రీ నగర్, విద్యుత్ నగర్ కాలనీలో గల శ్రీ మంగళగౌరీ సమేత మరకత శివ లింగేశ్వర దేవాలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ప్రహరీని బుధవారం పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఆలయ ప్రహరీని రెండు ఫీట్లు రోడ్లకు జరిగిందని కూల్చివేశారని తెలిపారు. కొన్ని రోజులుగా తాము చందాలు వసూలుచేసి ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. మున్సిపల్ అధికారులు ముందే నోటీసులు అందించాల్సి ఉండగా, అలాంటిదేమి చేయకుండా ఆలయ ప్రహరీని కూల్చివేయడం ఏంటని కాలనీ వాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. కాగా, మున్సిపల్ అధికారులు తాము ముందే నోటీసులు ఇచ్చామని అయినప్పటికీ రెండు ఫీట్లు రోడ్డుకు జరగడంతో కూల్చివేసినట్లు పేర్కొంటున్నారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# విభిన్నంగా వైకుంఠధామం

- దేవునిపల్లిలో రూ. కోటితో సౌకర్యాల ఆధునికీకరణ
- పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం
- దాతల సహకారంతో వైకుంఠరథం, వెయిటింగ్ హాల్ ఏర్పాటు



రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు



దేవునిపల్లిలో నిర్మించిన వైకుంఠధామం ముఖ ద్వారం

కామారెడ్డి రూరల్ : అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఊరూరా వైకుంఠధామాలను నిర్మించింది. అక్కడి వాతావరణం చూసి శ్మశాన వాటికకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతుంటారు. జిల్లాలోనే కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం మాత్రం అన్నింటికి కన్నా భిన్నంగా ఉంది.

**పార్క్‌ను తలపించేలా..**

ఊరి పక్కన లింగాపూర్ చెరువు కట్ట వద్ద నిర్మించిన వైకుంఠదామం చుట్టూరా ప్రహారీ, ఫెన్సింగ్ నిర్మించారు. స్వాగత తోరణం ఎంతో ఆకర్షణీయంగా ఉంది. లోపలికి వె వెళ్లగానే పార్కులా రోడ్డుకిరువైపుల చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటుంది. శవాల దహన కోసం రెండు గద్దెలు నిర్మించి దాని పైకప్పు అందంగా తీర్చిదిద్దారు. లోపల శవ దహన వేదిక వద్దకు వెళ్లడానికి సీసీ రోడ్డు నిర్మించారు. రోడ్ల పక్కన రకరకాల మొక్కలు నాటారు. అలాగే స్నానపు గదులు పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా షవర్‌లతో ఏర్పాటు చేశారు, బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేశారు. నీటి సౌకర్యం కోసం బోరు మోటారు పైన ట్యాంకు నిర్మించారు.



వైకుంఠధామంలో నిర్మించిన వెయిటింగ్ హాల్



వైకుంఠధామంలో దహన వాటికలు

### సౌకర్యాలు..

వైకుంఠధామంలో సెక్యూరిటీ గది, స్టోరేజ్ గది, దింపుడు కళ్లం, రెండు శవదహన గద్దెలు, వెయిటింగ్ గ్యాలరీ, టాయిలెట్ బ్లాక్, పూజా మండపం, తలనీలాలు సమర్పించే వేదిక, కట్టెల స్టోరేజ్, సిట్టింగ్ గ్యాలరీ, హైమాస్ట్ లైటింగ్, గ్రీనరీ, ఫుట్‌పాత్ పార్కింగ్, భద్రతా పరంగా నిర్మించిన కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్, కార్పొరేట్, రిసార్ట్‌లను తలపించేలా నిర్మించిన స్వాగత తోరణం ఉన్నాయి. ఈవైకుంఠధామం నిర్మాణానికి ప్రభుత్వం సుమారు రూ.70 లక్షలు వెచ్చించగా, గ్రామస్తులు మరో రూ. 30 లక్షలు విరాళంగా అందజేసి వైకుంఠధామం సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మృతదేహాలను వైకుంఠధామం వరకు తీసుకెళ్లేందుకు వైకుంఠ రథం, సిబ్బంది, సౌకర్యాలను 35వ వార్డు మాజీ కౌన్సిలర్ పోలీస్ కృష్ణాజీరావు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.10 లక్షలతో ట్రాక్టర్, వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా అందజేశారు.



ఏర్పాటు చేసిన వైకుంఠ రథం

### తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా..



మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 10 లక్షలతో ట్రాక్టర్, వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేశా. గ్రామంలో ఎవరూ చనిపోయిన వారికి ఉచితంగా అంతిమ సంస్కారాలకు పంపిస్తూ సేవలందిస్తున్నాను. వైకుంఠధామాన్ని అన్ని హంగులతో జిల్లాలోనే ఆదర్శంగా నిర్మించాం.

– పోలీస్ కృష్ణాజీరావు, 35వ వార్డు మాజీ కౌన్సిలర్, దేవునిపల్లి

### వెయిటింగ్ హాల్ నిర్మించాను



వైకుంఠధామంలో అంత్యక్రియలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం మా నాన్న కాసర్ల రాజయ్య జ్ఞాపకార్థం రూ.10 లక్షలు వెచ్చించి వెయిటింగ్ హాల్ నిర్మించాను. అలాగే అందులో బల్లలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశాను. దహన సంస్కారాలకోసం వచ్చిన వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఈ వెయిటింగ్ హాల్ నిర్మించాను.

– కాసర్ల గోదావరి స్వామి, 12వ వార్డు మాజీ కౌన్సిలర్, దేవునిపల్లి

# రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



బాన్సువాడలో నివాళులు అర్పిస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బాన్సువాడలో..



ఎల్లారెడ్డిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ/ఎల్లారెడ్డి/రాజంపేట/మాచారెడ్డి/భిక్కనూరు : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని పలు చోట్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మాచారెడ్డిలో..



రాజంపేటలో..



భిక్కనూరులో నినాదాలు చేస్తున్న నాయకులు

### నేడు భూంపల్లికి ఎమ్మెల్యే రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని భూంపల్లి గ్రామానికి గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సంగారెడ్డి తెలిపారు. భూంపల్లి పరిధిలో గతంలో చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తారన్నారు. పనులను పున:ప్రారంభించడానికి రూ. 22 కోట్లు మంజూరు విషయం రైతులకు వివరిస్తారన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు విధిగా హాజరు కావాలని కోరారు.

### నర్సరీలలో కానరాని మొక్కలు





పిట్లం(జుక్కల్): హరితహారంలో భాగంగా ప్రభుత్వం ప్రతి సంవత్సరం వానాకాలంలో మొక్కలు నాటుతోంది. ఇందుకు గాను వానాకాలం కంటే రెండునెలల ముందు నుంచే నర్సరీలలో మొక్కలను సిద్ధం చేస్తుంది. క్షేత్రస్థాయిలో పలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పిట్లం మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీలలో 4వేల మొక్కలు పెంచుతోంది. పిట్లం మండలంలోని జగదాంబతండా, బుర్నాపూర్, కిష్టాపూర్ తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని నర్సరీలలోనూ మొక్కలు పెంచుతున్నారు. అక్కడ కవర్లు తప్ప మొక్కలు కనిపించడం లేదు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేస్తున్న వారిపై సంబంధిత శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

ఎల్లారెడ్డి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులకు అమృత్ మిత్ర 2.0 కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అందించారు. మెప్మా అధికారులు తదితరులున్నారు.



కరపత్రాలను అందిస్తున్న కమిషనర్ మహేష్‌కుమార్

# అర్హులందరికి ఇళ్లు మంజూరు చేస్తాం

- మొదటి విడతగా 3450 ఇళ్లు మంజూరు
- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



లింగంపేట రైతు వేదికలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): నియోజకవర్గంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారదర్శకంగా విచారణ చేపట్టి లబ్ధిదారులను ఎంపిక చేయడం పట్ల వారిని అభినందించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మొదటి విడతగా 3450 గృహాలు మంజూరైనట్లు తెలిపారు. మండలానికి రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు పేర్కొన్నారు. 22వ ప్యాకేజీ కాళేశ్వరం ప్రాజెక్టు కోసం రూ. 23 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. లింగంపేట మండలంలో భూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పర్మళ్ల గ్రామంలో పెద్దమ్మ అలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి, ఏడీఈ మల్లేశం, ఏఈ సాయినాథ్, దశరథ్, ఎల్లమయ్య, మోహిద్, రఫీక్, శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యుత్‌ప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ**

ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లో జరిగిన విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. బాధితులు జోడు సంగీత, మల్లమ్మ, పారిజాతం, మామిడి సంగీత, కొంగల చంద్రకళ, పూజారి లచ్చవ్వ, లావణ్య, లక్ష్మిలకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు.

# బస్సులను సర్వీస్ రోడ్డు మీదుగా నడపాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని దగ్గి–తిమ్మాజివాడి స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులను సర్వీస్ రోడ్డు మీదుగా నడపాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి ఆధ్వర్యంలో యాచారం, వజ్జపల్లి, ఉత్తునూర్, తిమ్మాజివాడి, తుక్కోజివాడి గ్రామాల నాయకులు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ కరుణశ్రీకి బుధవారం వినతి పత్రం అందజేశారు. 44వ జాతీయ రహదారిపై నుంచి బస్సులను తీసుకెళ్లడంతో రోడ్డును దాటడానికి ప్రజలు ఇబ్బందులు పడటంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సర్వీస్ రోడ్డుకు ఇరు వైపుల బీటీ రోడ్డు ఉన్న బస్సులను మాత్రం సర్వీస్ రోడ్డు మీదుగా తీసుకెళ్లడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సంగ్య నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, సాదకలీ, గాదె చిన్నన్న తదితరులు పాల్గొన్నారు.

# అకాలవర్షంతో అవస్థలు



బాన్సువాడ అయ్యప్ప ఆలయానికి వెళ్లేదారిలో నిలిచిన వర్షపు నీరు


మద్నూర్/బాన్సువాడ/నిజాంసాగర్ : మద్నూర్ మండలం మేనూర్, సలాబత్‌పూర్, మద్నూర్ గ్రామాల్లో, నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లో మంగళవారం రాత్రి, బుధవారం భారీ వర్షం కురిసింది. వర్షంతో లోతట్టు ప్రాంతాలన్ని నీటితో నిండిపోయాయి. రోడ్లపై గుంతలలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బాన్సువాడ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందు, అయ్యప్ప ఆలయంకు వెళ్లే దారిలో, టీచర్స్ కాలనీ, వాసవీ కాలనీ, సాయికృపా నగర్ కాలనీ, అంబేడ్కర్ చౌరస్తా వద్ద, పాత బాన్సువాడకు వెళ్లే దారిలో వర్షపు నీరు నిలవడంతో వాహనదాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పాడ్డాయి. డ్రైనేజీల్లో చెత్తచెదారం నిండిపోయింది.



మద్నూర్‌లో ..

### భిక్కనూరులో మొలకెత్తిన ధాన్యం

భిక్కనూరు: మండలంలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం ఆరబోసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. ఆరోబోసిన ధాన్యానికి మొలకలు రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కాంటాలు అయినప్పటకి ధాన్యం బస్తాలు రైస్‌మిల్లులకు చేరకపోవడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. వెంటనే కాంటాలను వేగవంతం చేయించి రైస్‌మిల్లులకు ధాన్యంను తరలించాలని రైతులు కోరుతున్నారు.



భిక్కనూరులో మొలకెత్తిన ధాన్యం

### పెద్దమ్మతల్లికి బోనాలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట గ్రామంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాల పండుగను నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనమెత్తుకొగా పోతరాజుల విన్యాసాలతో ఊరేగింపుగా వచ్చి పెద్దమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు.





## సంక్షిప్తం

**మత్తడి పోచమ్మ ఆలయానికి విరాళం**

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయానికి ముదిరాజ్ సంఘం నాయకులు రూ. 1,21,116 విరాళంగా అందజేశారు. మత్తడి పోచమ్మ ఆలయం అభివృద్ధి చేయడంతో పాటు నూతనంగా అలయ నిర్మాణం చేపడుతున్నారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు వారు నగదు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**29న సామూహిక కల్యాణ తిలక పూజోత్సవం**

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని శ్రీసంకష్టహార గణపతి ఆలయంలో ఈనెల 29న సామూహిక కల్యాణ తిలక పూజోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సుతారి అంజయ్య, బి.రవీందర్‌గౌడ్, బి.విశ్వనాథంలు తెలపారు. ఈకార్యక్రమంలో వంద మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. వేదపండితులు జి.అంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక కల్యాణ తిలక కార్యక్రమంలో పాల్గొనే వారు 88852 99917, 94419 54494 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**జీపీ రికార్డుల పరిశీలన**



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఎంపీవో పీవీ రమణ సూచించారు. బుధవారం మండలంలోని లింగంపల్లి జీపీని ఆయన పరిశీలించారు. పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, శ్మశాన వాటికలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

**వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి**

ఎల్లారెడ్డి : వృత్తి నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డి సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకళాశాలలో 2017 నుంచి ఇంటర్ ఆపై చదువులు చదువుకుని ఇంత వరకు ఎలాంటి ఉద్యోగం పొందని వారికి ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కళాశాలలో సంప్రదించాలన్నారు.

**ఈనెల 28న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ**

బాన్సువాడ రూరల్: మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఈనెల 28న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు బాన్సువాడ డివిజన్ అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రికలు అందించామన్నారు. నాయకులు నెర్రె నర్సింహులు, బంగారు మైసయ్య, గైనిరవి, మన్నె చిన్నసాయిలు, శివయ్య, బేగారి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.